క్లుప్తంగా

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ వీరాభిమాని, విశ్రాంత అధ్యాపకుడు కొల్ల పారన్నాయుడు అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్టీ మండల నాయకులతో కలిసి శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పెదబోగిలి సచివాలయ కన్వీనర్ ఎస్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం



సమావేశంలో సభ్యులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలో పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొనగా, మున్సిపల్ అధికారులు సమావేశ అజెండాను చదివి వినిపించారు. సభ్యులందరి సమ్మతితో అజెండాను ఆమోదించారు. ఇదిలా ఉండగా, ఓ దశలో టీడీపీ కౌన్సిలర్ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌పై కుల దూషణకు పాల్పడడంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. సమావేశంలో కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఎన్నికల విధులు నిర్వహించాలి



సూచనలిస్తున్న తహసీల్దార్ అప్పలరాజు

బలిజిపేట: రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి, నిర్దేశించిన ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ అప్పలరాజు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెక్టార్ ఆఫీసర్లతో శనివారం సమావేశమైన ఆయన ఎన్నికల విధుల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. విధుల్లో పాటించాల్సిన నియమాలు, నిబంధనలు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్లను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 సామల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి శనివారం తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులు, హాజరు పట్టికలు పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్, టీచింగ్ డైరీ, బోధనా తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందించాల్సిన సేవలు, స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, సమగ్ర భూసర్వే, నాలా పన్ను వసూళ్లు, తదితర అంశాలపై సూచనలు చేశారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, ధాన్యం కొనుగోలులో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆయనతో పాటు డీటీ బుచ్చయ్య, ఆర్ఐ పుష్ప ఉన్నారు.

ఉపాధి పనుల నిర్వహణపై శిక్షణ

సీతానగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మేట్‌లకు పనుల నిర్వహణపై శనివారం శిక్షణ ఇచ్చారు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్ ఆధారంగా మస్తర్లు వేయడం, కొలతల ప్రకారం పనులు చేయించడం, గుర్తించిన పనుల మేర పనులు చేయడం వంటి వాటిని మేట్‌లకు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో భాను తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే

సుపరిపాలన సాధ్యం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని లోవరకండి, గొడేవలస, కొయ్యానపేట పంచాయతీల పరిధిలోని కంచేడువలస, కొయ్యనపేట గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో లోవరకండిలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని, గొడేవలసలో పాఠశాల భవనం నిర్మించాలని, పోడుపట్టాలు ఇవ్వాలని, ఇంటి బిల్లులు చెల్లించాలని కోరారు. స్పందించిన డిప్యూటీ సీఎం ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గ్రామసచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలు నెరవేర్చి, గొప్ప ముఖ్యమంత్రిగా పేరొందారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగనన్న ఒక్కరేనన్నారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం జనవరి నుంచి కొత్త పింఛన్లు అందివ్వడంతో పాటు పింఛన్ పెంపు కూడా అందివ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ సర్కారుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. జనమంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచ్‌లు గేదెల రాధిక, పోల ఉమామహేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు వంగపండు అప్పలనాయుడు, ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, ఏవో శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం సన్నిబాబు, హౌసింగ్ ఏఈ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

● క్రీడలతో ఉజ్వల భవిష్యత్



సీతానగరం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలో పాల్గొన్న లచ్చయ్యపేట క్రీడాకారులు

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. పార్వతీపురం నియోజకవర్గంలోని సీతానగరం మండలంలో శనివారం జరిగిన పోటీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడాకారులను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలన్నారు.



సీతానగరం: షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ, ఎంపీడీవో ప్రసాద్

– సాక్షి నెట్‌వర్క్

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



బాగువలస పాఠశాలలో డిజిటల్ బోర్డు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ సురేష్

సాలూరు: విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ఆకాంక్షించారు. మండలంలోని బాగువలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోర్డును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలు తీర్చిదిద్దారన్నారు. వీటితో పాటు జగనన్న విద్యాకానుక, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యాదీవెన, అమ్మఒడి పథకాలతో విద్యార్థులను ఆదుకుంటున్నారన్నారు.

బిల్లుమడ పరిసరాల్లో 144వ సెక్షన్

సీతంపేట: మండలంలోని బిల్లుమడ పరిసరాల్లో 144వ సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లుమడ రెవెన్యూ గ్రామంలో విశాఖపట్నం కాపురస్తులు వి.వెంకటపతిరాజు తండ్రి గోపాల కృష్ణంరాజు, మరో ముగ్గురు ఆసామీలకు 73.74 సెంట్ల జిరాయితీ భూమిపై వివాదం ఉన్న నేపథ్యంలో 144వ సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ భూమిపైకి ఎవ్వరూ వెళ్లకూడదన్నారు.

నిబంధనలు పాటించండి

- డీఎస్పీ కృష్ణారావు



పాలకొండ రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనే యువత నిబంధనలు పాటించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన వి లేకరులతో మాట్లాడుతూ, వీధుల్లో భారీ మైక్‌సెట్లు పెట్టకూడదని తెలిపారు. అర్ధరాత్రి తర్వా త రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ, ఇతరుల ను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వం దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలు

- కమిషనర్‌ను కోరిన కార్మిక సంఘ నాయకులు



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్మికులు

పాలకొండ రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కార్మిక సంఘ నాయకులు పడాల భాస్కరరావు, సీహెచ్ సురేష్, తదితరులు కోరారు. ఈ మేరకు పాలకవర్గ ప్రతినిధులతో పాటు కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావును శనివారం కలిసి తమ సమస్యలు వివరించారు. సమాన పనికి సమాన వేతనం, ఒప్పంద ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, తదితర హామీలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. తమకు మద్దతుగా ఇంజినీరింగ్ విభాగంలో గల ఎలక్ట్రికల్, వాటర్ నిర్వహణ సిబ్బంది ఆదివారం నుంచి సమ్మెలో పాల్గొంటారని తెలిపారు.

కుల రాజకీయాలు టీడీపీకి కొత్తేమీ కాదు..



టీడీపీ వైఖరిని ఎండగడుతున్న కాపు సంఘం నాయకులు

- టీడీపీ వైఖరిపై మండిపడిన కాపు సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: కుల రాజకీయాలు టీడీపీకి కొత్తేమీ కాదని, ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత దూషణలను కులాలపై రుద్ది, చిచ్చుపెట్టేందుకు ఆ పార్టీ ప్రయత్నించడం ఎంతమాత్రం సరికాదని కాపు సంఘం నాయకుడు కొండపల్లి బాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద టీడీపీ వైఖరికి వ్యతిరేకంగా మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో భాగంగా ప్రజాసమస్యలు పరిష్కరించాల్సింది పోయి, వ్యక్తిగత గొడవలు పెట్టి, టీడీపీ రాజకీయం చేసిందన్నారు. దయచేసి కులాలను రాజకీయాలకు వాడుకోవద్దని, కులాల మధ్య తగాదాలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు కులాలను వాడుకోవాలనుకునే క్రమంలో మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడం తగదన్నారు. సామాజిక మాధ్యమాల్లో కాపు కులస్తులను రెచ్చగొట్టే పోస్టులను కొందరు స్వార్థ టీడీపీ నాయకులు పెడుతున్నారన్నారు.

కాపు సోదరులు, యువత అంతా ఈ విషయాన్ని గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు మంత్రి రవికుమార్, గొర్లి మాధవరావు, కొండపల్లి రుక్మిణి, సువ్వాడ లావణ్య, సంగిరెడ్డి పార్వతి, మంత్రి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నాం..

- ట్రాన్స్‌కో డీఈఈ మోహన్ చక్రవర్తి



నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న డీఈఈ, ఏఈ, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల పాలకొండ,వీరఘట్టం, వంగర మండలాలకు మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతోందని ట్రాన్స్‌కో డీఈఈ మోహన్‌చక్రవర్తి అన్నారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. ముఖ్యంగా జంగిల్ క్లియరెన్స్, పొలాల మధ్య వేలాడే తీగలను సరిచేయించారు. అలాగే మెరుగైన సరఫరా కోసం ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్ సరఫరా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. పాలకొండ పట్టణ పరిధి జగనన్న కాలనీలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు యద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. ఈయన వెంట ఏఈ శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



వేణుగోపాలస్వామి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం



బలిజిపేట: చిలకలపల్లిలో వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సీతానగరం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక సువర్ణముఖి నదీతీరాన కొలువైన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున భక్తులు నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి, నగర సంకీర్తన చేపట్టారు. స్వామి వారిని స్తుతిస్తూ వీధుల్లో తిరుగాడుతూ భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. బక్కుపేట, బళ్లకృష్ణాపురం, మరిపివలస, సూరంపేట, గాదెలవలస గ్రామాల్లో భక్తులు ధనుర్మాస పూజలు చేశారు.

తులసీదళాలతో అలంకరణ..

బలిజిపేట: ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకుని, మండలంలోని చిలకలపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న స్వామి వారిని 10 వేల తులసీదళాలతో శనివారం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామున భక్తులు నగర సంకీర్తన చేపట్టి, స్వామిని ఆరాధిస్తూ గీతాలాపన చేశారు.



సాలూరు: వేణుగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వైభవంగా స్వామి కల్యాణోత్సవం..

సాలూరు: స్థానిక పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్టీ నేతలు, కార్యకర్తలను దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ పార్వతీపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. స్థానిక 16, 17వ వార్డుల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశమైన ఎమ్మెల్యే బూత్ కమిటీల ఏర్పాటు, 2024 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. మన ప్రాంతం, మనం అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును ఇంటింటికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్ లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికే ప్రభుత్వం ప్రాధాన్యం



చినమరికి గ్రామస్తులతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర అభివృద్ధికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని చినమరికి గ్రామాన్ని శనివారం సందర్శించిన ఆయన గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారు కొన్ని ప్రతిపాదనలు చేయగా, గ్రామానికి ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేర్చడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అతి త్వరలోనే ఎస్సీ కాలనీలో మిగిలిన సీసీ రోడ్లు, గ్రామ ప్రధాన రహదారిపై బీటీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

అనంతరం పండగ నేపథ్యంలో ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో సమకూర్చిన చీరలను మహిళలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు కృష్ణమూర్తి, సచివాలయ కన్వీనర్ రాగల సోమశేఖర్, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

- కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: అధికారులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో నగర పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందని కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాదిలో ఇంతవరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కమిషనర్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమన్వయంతో పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. నగర పంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి మాట్లాడుతూ, మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పట్టణంలో చేపడుతున్న సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారతపై అవగాహన



ఉచిత కుట్టు శిక్షణ గుర్తింపు పత్రాలతో మహిళలు

భామిని: మండల కేంద్రంలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థి క సాధికారత, స్వావలంబన, రుతుస్రావ పరిశుభ్రతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ పలు సూచనలు చేశారు. అనంతరం మూడు నెలలుగా కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు గుర్తింపు పత్రాలు, గ్లో క్లబ్ టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ట్రైనీ సభ్యులు, గ్లో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జన్‌మన్ కార్డుల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ, ఆర్.డి.వలస, సీమలవానివలస, గదబవలస గ్రామాల్లో పీఎం జన్‌మన్ కార్డులు శనివారం పంపిణీ చేశారు. అర్హులైన 81 మందికి కార్డులు అందజేశారు. ఈ కార్డులున్న గిరిజనులకు గృహాలు మంజూరు చేసి, నిర్మాణానికి రూ.2.40 లక్షలు అందిస్తారు.